# జిహెచ్ఎంసి ఆదాయం తగ్గనుందా ?

**లెక్కలు వేస్తున్న అధికారులు.. అప్పులు ట్రై కార్పొరేషన్‌లకు ఎలా విభజించాలి.. నిపుణులతో టాస్క్‌ఫోర్స్ఏర్పాటు**









**హైదరాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** నగరాన్ని విస్తరించడంలో భాగంగా కొత్తగా జిహెచ్ఎంసి, సిఎంసి, ఎంఎంసిలను ఏర్పాటు చేశారు. ఇలా మూడు భాగాలుగా విభజించడం వల్ల శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావించింది. అయితే తాజాగా జీహెచ్ఎంసీ ఆస్తులు, అప్పులు అనే అంశం తెరపైకి వచ్చింది. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ పరిధి అభివృద్ధి కోసం చేసిన అప్పులు తీర్చడం ఏలా అనే అంశం తెరపైకి వచ్చింది. జీహెచ్ఎంసీ ఇప్పటి వరకు రూ. 4800 కోట్ల వరకు అప్పుల్లో ఉంది. ఇప్పటివరకు అప్పులు, వడ్డీలు చెల్లించడం కోసం ఏడాదికి దాదాపు రూ. 1300 కోట్లు చెల్లిస్తోంది. దీంతో ఇప్పటికే అనేక సమస్యలు ఎదుర్కొంటోంది. నిర్వహణ ఖర్చులు, వేతనాలు, రోడ్ల నిర్మాణ, విస్తరణలాంటి వాటికే జీహెచ్ఎంసీకి వచ్చే ఆదాయం సరిపోవడం లేదు. ఉన్న ఖర్చులు భరించ లేక నానా తిప్పలు పడాల్సి వస్తోంది. తాజాగా ట్రై కార్పొరేషన్ ఏర్పాటుతో జీహెచ్ఎంసీ పరిస్థితి మరింత దారుణంగా మారే పరిస్థితి ఏర్పడే అవకాశాలు ఉన్నాయని అధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం.

**ఎందుకంటే....**

జీహెచ్ఎంసీకి ప్రతి ఏడు వస్తున్న ఆదాయంలో వడ్డీలు, అప్పులు చెల్లించడం కోసం ఒకవేయి మూడు వందలకోట్లు ఖర్చు అవుతోంది. దీంతోనే ఇప్పటి వరకు నెట్టుకు వచ్చింది. తాజాగా ట్రై కార్పొరేషన్‌లు ఏర్పడడం వల్ల ఆదాయం తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న చాలా ప్రాంతాలు ట్రై కార్పొరేషన్‌లో విలీనం కాగా వాటి పరిధిలోని కొన్ని ప్రాంతాలు జీహెచ్ఎంసీలో కలిశాయి. దీంతో జీహెచ్ఎంసీ ఆదాయం గణనీయంగా తగ్గుతోందని అధికారులే అంటున్నారు. జీహెచ్ఎంసీ ఉండగా ఖైరతాబాద్, శేరిలింగంపల్లి జోన్ల పరిధిలో అధికంగా ఆస్తిపన్ను వసూలయ్యేది. కిందటి ఆర్థిక సంవత్సరంలో వసూలైన రూ.2,038 కోట్ల పన్నులో ఈ రెండు జోన్ల నుంచి రూ.780 కోట్ల ఆదాయం సమకూరింది. ఎక్కువ ఆదాయం శేరిలింగంపల్లి నుంచి వసూలైంది. ఈ తరువాత కూకట్‌పల్లి, ఎల్బీనగర్ జోన్లు ఉండేవి. ప్రస్తుతం కూకట్‌పల్లి సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలోకి, ఎల్బీనగర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వెళ్లాయి. ఇలాంటి పరిస్థితిలో ఆస్తి పన్ను వసూలులోనూ వ్యత్యాసం ఉండే అవకాశముంది. ప్రస్తుత జీహెచ్ఎంసీ పరిధిలో ఖైరతాబాద్, చార్మినార్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ, శంషాబాద్ జోన్లు ఉన్నాయి.

**అప్పులు ఎలా... ఎందుకు జరిగాయి...**

జీహెచ్ఎంసీ అంతకుముందు దాదాపు ఆరువేల కోట్ల వరకు అప్పులు చేసింది. అవసరమైన ప్రాంతాలలో వంతెనలు, నాలా విస్తరణ, రహదారుల విస్తరణ, నిర్మాణం, నిర్వహణ, అభివృద్ధిలో భాగంగా(సీఆర్ఎంపీ) రూ.5,640 కోట్లు అప్పు చేసింది. అంతేకాకుండా మున్సిపల్ బాండ్ల జారీ చేసి రూ.495 కోట్లు సమీకరించారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం ద్వారా గతంలో పేదలకు ఇండ్ల నిర్మాణం కోసం, అసంపూర్తిగా ఉన్న ఇండ్ల మరమ్మతుల కోసం రూ.140 కోట్లు రుణంగా తీసుకుంది. జీహెచ్ఎంసీ ఇప్పటివరకు అప్పులు, వడ్డీలు చెల్లిస్తూ వచ్చి దాదాపు రూ. 980 కోట్లు మాత్రమే చెల్లించినట్లు సమాచారం. ఇంకా రూ. 4,800 కోట్లు అప్పుతో పాటు వడ్డీ కూడా కలిపి చెల్లించాల్సి ఉంది. అయితే ట్రై కార్పొరేషన్‌కు జీహెచ్ఎంసీ అప్పుడు కూడా చెల్లించేలా చర్యలు తీసుకోవాలా, లేదా నిర్ధారించుకోడానికి ఇప్పటికే ఇందుకోసం నిపుణుల కమిటీని ఏర్పాటుచేశారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ ఉండగానే (ట్రైకార్పొరేషన్ ఏర్పాటు కాకముందు) మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ) పరిధిలోని ఎల్బీనగర్, బైరామల్‌గూడ, కామినేనిజంక్షన్, నాగోల్, ఒవైసీ జంక్షన్ వంతెనలు నిర్మించారు. నిర్మాణంలో ఉన్న ఉప్పల్ నారపల్లి పొడిగింపు వంతెన పనుల కోసం రూ.773 కోట్లు వెచ్చించారు. అలాగే ప్రస్తుత సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలోని శేరిలిం గంపల్లి, కూకట్‌పల్లి జోన్లలో బయో డైవర్సిటీ, మైండ్ స్పేస్, కేబుల్ బ్రిడ్జి, కొత్తగూడ, అయ్యప్ప సొసైటీ, శిల్ప లే అవుట్, కూకట్‌పల్లి రాజీవ్‌గాంధీ నగర్ చౌరస్తా, ఖైతలాపూర్ తదితర ప్రాంతాల్లో వంతెనలు లాంటి వాటికోసం రూ. 1709 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుత జీహెచ్ఎంసీ పరిధిలోని ఇందిరాపార్కు వీఎస్టీ, నల్గొండ ఎక్స్ రోడ్, ఆరాంఘర్ జూపార్కు, బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట వంతెనలు నిర్మించారు. ఎస్ఎన్ఎపీ అప్పు రూ.680 కోట్లు వెచ్చించారు. సీఆర్ఎంపీ కోసం రూ.1460 కోట్ల అప్పు చేశారు.

అందువల్ల తాజాగా ఏర్పడిన ఏ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధికి ఎంత ఖర్చుచేశాము, ఎంత అప్పు చేశాము అనే అంశాలను పరిగణలోకి తీసుకుని అప్పులు విభజించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అలాగే ఏ కార్పొరేషన్ పరిధిలో ఎంత పన్నులు వసూల్ అవుతాయో, ఎలాంటి అభివృద్ధికి కార్యచరణ ఉండాలో కొత్తగా ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ పరిశీలించనున్నట్లు సమాచారం.



# హైదరాబాద్ వార్త



# హర హర మహాదేవ

## వైభవంగా మహా శివరాత్రి వేడుకలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** ఓం నమఃశివాయ..శంభో శంకర.. హరహర మహాదేవ.. నామస్మరణలతో భాగ్యనగరం మారుమోగింది. మహా శివరాత్రి సందర్భంగా శివ నామస్మరణలతో భక్తులు పులకరించారు. జంగమయ్యను భక్తితో కొలిచారు. ఆదివారం ప్రఖ్యాత శైవ క్షేత్రం కీసర శ్రీరామలింగేశ్వర దేవాలయానికి భక్తులు పోటెత్తారు. శివ లింగాల వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే.. నగరంలోని శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు కనుల పండువగా జరిగాయి. శైవక్షేత్రాలు తెల్లవారుజామునుంచే కిటకిటలాడాయి. భక్తులు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, పూజలుచేశారు. అర్ధరాత్రి 12గంటలకు లింగోద్భవ సమయంలో అర్చకులు నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. జాగరణ చేసిన భక్తుల కోసం ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



బండారు దత్తాత్రేయను ఆశీర్వదిస్తున్న దృశ్యం

## హర్యానా మాజీ గవర్నర్ దత్తాత్రేయ భవానీ శివాలయంలో ప్రత్యేక పూజలు

**ముషీరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మహాశివరాత్రి సందర్భంగా భోలక్‌పూర్ దేవునితోటలోని భవానీ శంకరాలయంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలతో శివునికి అభిషేకం నిర్వహించారు.

## జూపార్కులో ప్రపంచ నీటి గుర్రాల దినోత్సవం

**చార్మినార్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :**

హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో ఆదివారం ప్రపంచ నీటి గుర్రాల దినోత్సవం జరిగింది. జూ పార్కులో ఉన్న నాలుగు నీటి గుర్రాలు కోసం పలు రకాల ఆకు కూరలు, కీరా, అరటి, సోపోటా, పైనాపిల్, వాటర్ మిలాన్‌తో పాటు వివిధ రకాల పండ్లు, గోధుమ పొట్టుతో తయారు ఐదు కేజీల కేక్‌లను తయారు చేశారు. నాలుగు నీటి గుర్రాలలు వద్ద కేక్‌లను జూపార్కు సిబ్బంది పెట్టారు. ఎంతో ప్రీతితో నీటి గుర్రాలు కేక్‌లను తిన్నాయి. ఈ కార్యక్రమంలో జూపార్కు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న గరికిపాటి నరసింహారావు

## భక్తి అంటే ప్రార్థన కాదు.. సేవ

**ప్రవచనకర్త డాక్టర్ గరికిపాటి నరసింహారావు**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త) :** శివభక్తి అంటే కేవలం గీతాలు పాడటం, ప్రార్థనలు చేయడం మాత్రమే కాదని, అది దైనందిన జీవితంలో చేసే సేవా కార్యక్రమాల్లో ప్రతిబింబించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహ రావు అన్నారు. ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి శివ భక్తి ఉత్సవం భక్తజన సందోహం మధ్య శ్రీద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇసాన్ ఫౌండేషన్, విజయ క్రియేషన్స్, సహభావన ఉత్సవ సమితి నిర్వాహకులు పేరి నాగేశ్వర్ రావు, పేరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రఖ్యాత ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు శివతత్వ ప్రవచనం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మానవజీవితంలో త్యాగం, సమాజ సేవ అత్యంత ముఖ్యమని, తోటివారికి సహాయపడటమే నిజమైన శివతత్వమని ఆయన ఉద్బోధించారు. కార్యక్రమ ప్రారంభంలో ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మి స్వాగత ప్రసంగం చేస్తూ, సమాజంలో ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక విలువలను పెంపొందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన భక్తి సంగీతం, సాహిత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. స్థానిక ప్రముఖులు, కళాకారులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని వేదికను ఆధ్యాత్మికమయం చేశారు. వాలంటీర్లు, సమితి సభ్యుల క్రమశిక్షణతో కూడిన నిర్వహణ పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం చివరలో సహకరించిన వారికీ పేరి నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఉత్సాహంగా జైడస్ పింకథాన్ రన్

**పరుగులో పాల్గొన్న 5 వేల మంది మహిళలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :**

జైడస్ పింకథాన్ హైదరాబాద్ ఆరో ఎడిషన్ ఆదివారం ఉదయం నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద అత్యంత ఉత్సాహంగా జరిగింది. దాదాపు 5,000 మంది మహిళలు ఈ పరుగులో పాల్గొనడం నగరంలో మహిళల ఫిట్‌నెస్ పట్ల పెరుగుతున్న చైతన్యాన్ని చాటిచెప్పింది. తెల్లవారుజామున 5:30 గంటలకే వివిధ వయసుల మహిళలు రఘు వంశీ 3 కి.మీ, లైఫ్‌లాంగ్ 5 కి.మీ, 10 కి.మీ విభాగాలతో పాటు అల్ట్రాడిస్టెన్స్ రేసుల కోసం సిద్ధమయ్యారు. తొలిసారి రన్నింగ్ చేస్తున్న వారు, ఉద్యోగినులు, సీనియర్ సిటిజన్లు, అనుభవజ్ఞులైన అథ్లెట్లు అందరూ కలిసి ఒకే వేదికపై పరుగు తీశారు. అల్ట్రా రన్నింగ్‌లో మహిళల సత్తాఖిఇన్విన్సిబుల్ ఉమెన్ఖి వేదికగా 50 కి.మీ, 75 కి.మీ, 100 కి.మీ, 100 కి.మీ రిలే వంటి అల్ట్రా విభాగాలను నిర్వహించారు. ఇండియాలో మహిళా రన్నర్లు క్రమంగా అల్ట్రారన్నింగ్ వైపు ఆకర్షితులవుతున్నారని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది. 3 కి.మీ విభాగంలో అమల కలపాల (19 నిమిషాల 10 సెకన్లు), 5 కి.మీ విభాగంలో మోనిక కలపాల (27 నిమిషాల 32 సెకన్లు), 10 కి.మీ. పరుగులో వడ్డే నవ్య (49 నిమిషాల 59 సెకన్లు) విజేతలుగా నిలిచారు. పింకథాన్ వ్యవస్థాపకుడు మిలింద్ సోమన్ మాట్లాడుతూ.. "హైదరాబాద్ మహిళలు తమ ఆరోగ్యం కోసం చూపిన ఉత్సాహం అద్భుతం. స్పోర్ట్స్ వేర్ లేదా సంప్రదాయ దుస్తులు అన్నది కాకుండా, ఆరోగ్యం కోసం పరుగు తీయాలన్న నిర్ణయం గొప్పది. వేలాది మంది ఇలా సూర్యోదయ వేళ ఆరోగ్యం కోసం కదలడం శుభపరిణామం" అని పేర్కొన్నారు.

ఇన్విన్సిబుల్ ఉమెన్ ఫౌండర్ అంకిత కొన్వర్ మాట్లాడుతూ.. మహిళలు కేవలం ఒక్కసారి పాల్గొని ఆగిపోకుండా, ప్రతి ఏటా పరుగు దూరాన్ని పెంచుకుంటూ ఫిట్‌నెస్‌ను జీవనశైలిలో భాగంగా మార్చుకుంటున్నారని తెలిపారు.




నెక్లెస్ రోడ్‌లో పింకథాన్ రన్‌కు వేలాదిగా పాల్గొన్న మహిళలు

## అనుమానాస్పదస్థితిలో ఇంజనీరింగ్ విద్యార్థిని మృతి

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** అనుమానాస్పద స్థితిలో ఒక ఇంజనీరింగ్ విద్యార్థిని మృతిచెందిన సంఘటన ఫిల్మ్‌నగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన గుగులోతు సంధ్యారాణి(20) షేక్‌పేటలోని నారాయణమ్మ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతుంది. షేక్‌పేటలోని మై హోమ్స్ గర్ల్స్ హాస్టల్‌లో నివసిస్తుంది. కాగా మూడేళ్లుగా హాస్టల్‌లో ఉంటున్న సంధ్య శనివారం ఉదయం 11.20గంటల ప్రాంతంలో మృతిచెందినట్లు హాస్టల్ యజమాని సజ్వాతబస్సుమ్ సంధ్య తండ్రి రఘుకు సమచారం అందించింది. లిఫ్ట్‌కు సమీపంలో కుమార్తె మృతదేహం కనిపించదని, మెడపై ఉరిబిగించిన ఆనవాళ్లు కనిపించాయని, ఘటనకుముందు నాలుగు రోజులుగా తన కుమార్తెలో హాస్టల్‌లో లేకున్నా తమకు సమాచారం ఇవ్వలేదని రఘు ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమార్తె మృతి వ్యవహారంలో హాస్టల్, కళాశాల యాజమాన్యంపై సమగ్ర దర్యాప్తు జరిగి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన తన ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు పోలీసులు ప్రాథమికంగా అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా వాలంటైన్స్ డే రోజున ఇంజనీరింగ్ యువతి మృతిచెందడంతో కారణాల కోసం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా సంధ్యారాణి బాత్‌రూంలో షవర్‌కు చున్నీతో ఉరివేసుకొని మృతిచెందింది.

### ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** ఓ విద్యార్థిని అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎం.ప్రభావతి, అశోక్‌బాబు దంపతులు కొంపల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె ఎం.నాగలిఖితసాయి(17) జీడిమెట్లలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో భోజనం అనంతరం తన గదిలో చదువుకుంటానని వెళ్లిన ఆమె, కొంతసమయం తర్వాత స్పందించక పోవడంతో కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. అపార్ట్‌మెంట్ సిబ్బంది సహాయంతో గదిలోకి ప్రవేశించగా, ఆమె అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా జేడ్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షి ంచి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# వీసా గడువు ముగిసినా తిష్ఠ!!

* నగరంలో ఉన్న విదేశీయులపై పోలీసుల దృష్టి
* రెండు వేల మందికి పైగా విదేశీయులు
* వారి దేశాలకు పంపేందుకు ఏర్పాట్లు
* కేసుల్లో మినహాయించి మిగిలినవారిని పంపేందుకు ప్రణాళిక




**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

వివిధ కారణాలతో నగరానికి వచ్చి వీసా ముగిసినా తిష్టవేసిన విదేశీయులపై పోలీసు శాఖ దృష్టి సారించింది. దాదాపు నగరంలో రెండువేల మందికి పైగా తిష్ట వేసినట్లు గుర్తించిన పోలీసు శాఖ అందులో ముందస్తుగా ఆఫ్రికన్ దేశస్థులను ఇక్కడి నుంచి పంపిచేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తుంది.. మరోవైపు స్పెషల్ బ్రాంచి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫారినర్ మానిటరింగ్ సెల్ ఆధ్వర్యంలో విదేశీయుల కదలికలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించింది.. ఆసుపత్రులు, చదువుల పేరుతో నగరానికి వచ్చిన వారు వీసా ముగిసినా ఇక్కడి నుంచి కదలకుండా ఉంటున్నట్లు గుర్తించి ఇప్పటికే లెక్కలు తీశారు.. మరోవైపు కొందరు విదేశీయులు ఆధార్‌కార్డులనుసైతం సొంతం చేసుకున్నట్లు గుర్తించారు.. ఈ క్రమంలోనే కేసుల్లో ఉన్న వారిని మినహాయించి వీసా గడువు ముగిసిన విదేశీయులను పంపించేందుకు పక్కాగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది.

**చదువు.. ఆరోగ్యం...**

హైదరాబాద్ విదేశీ విద్యార్థులకు ఒక ఎడ్యుకేషన్ హబ్‌లాంటింది. చాలా దేశాల నుంచి ఇక్కడికి చదువుకోవడానికి వస్తుంటారు. అందులో ప్రధానంగా ఆఫ్రికన్ దేశాల నుంచి ఎక్కువగా చదువుకోవడానికి, ఆరోగ్యపరీక్షలు, శస్త్రచికిత్సల కోసం ఎక్కువ మంది నగరానికి వస్తుంటారు. నైజీరియా, ఐవరీ కోస్ట్, కెన్యా, ఉగాండ, సూడాన్, టాంజానియా దేశాల నుంచి విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో నగరానికి వస్తుంటారు. ఈ క్రమంలోనే నగరంలో ఆఫ్రికన్ స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఎస్ఏ) సైతం ఏర్పాటు చేసుకున్నారు. అయితే మాదకద్రవ్యాల వ్యవహారంలో చాలా మంది ఆఫ్రికన్లు ప్రధానంగా ఉండటంతో పోలీసులు వారి వీసాలపై దృష్టిసారించారు. నగరంలో దాదాపు రెండు వేల మందికి పైగా విదేశీయులు ఉండగా అందులో వీసా గడువు తీరిన వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఆసుపత్రులకు వచ్చిన వారిలో చాలా మంది చనిపోవడం, మరికొందరు అదృశ్యమవ్వడం, వీసా గడువు ముగియడంతో చిక్కకుండా తప్పించుకొని తిరగడం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అలాంటి వారిని గుర్తించేందుకు పోలీసు శాఖ ప్రయత్నిస్తుంది.

**పంపేందుకు ఏర్పాట్లు..**

నగరంలోని టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే పారమౌంట్ కాలనీని మినీ ఆఫ్రికాగా అభివర్ణిస్తారు. ఇక్కడ దాదాపు 700ల మందికిపైగా విదేశీయులు నివసిస్తున్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. ఇక్కడు నివాసాల యజమానులు సైతం విదేశాల్లో ఉండటంతో వారి ఇళ్లను మొత్తం విదేశీయులకే అద్దెకు ఇచ్చారు. ఇందుకోసం ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా ఏజెంట్లు ఉన్నారు. వీరికి అద్దెకు ఇచ్చేందుకు ఇళ్లేకాకుండా వాహనాలు ఉంటాయి. అయితే చాలా సందర్భాల్లో మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో ఆఫ్రికన్లు పట్టుబడుతుండటంతో పోలీసులు వీరిపై ప్రత్యేకమైన నిఘా పెట్టారు. గతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వమించి ఎంబసీ ద్వారా విదేశీయులను నగరం నుంచి వారి దేశాలకు పంపించిన సందర్భాలున్నాయి. అలాగే ఇప్పుడు సైతం మరోసారి వీసా గడువు ముగిసిన వారిని తిప్పి పంపేందుకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నారు.

ఇందుకోసం గడువు ముగిసి నగరంలోనే తిష్టవేసిన ఆఫ్రికన్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎంబసీతో మాట్లాడి తిప్పి పంపేందుకు పోలీసు శాఖ అవసరమైన సన్నాహాలు చేస్తుంది. చాలా మంది వైద్యం కోసం వచ్చి వీసా ముగిసినా సమాచారం ఇవ్వకుండా, దేశం తిరిగి వెళ్లకుండా ఉన్న వారితోపాటు చదువుకోవడానికి వచ్చి సమయం దాటినా వెళ్లకుండా ఇక్కడే ఉంటున్న వారిని తొలి దశలో పంపాలని భావిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా దాదాపు 500ల మంది నగరం నుంచి వెళ్లే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికలను ఇప్పటికే ఫారినర్ మానిటరింగ్ సెల్ ఉన్నతాధికారులకు ఇవ్వడంతోపాటు ఎంబసీకి అందించినట్లు సమాచారం.

## అంతర్‌రాష్ట్ర గంజాయి రవాణాదారుల అరెస్ట్

**10 కిలోల గంజాయి స్వాధీనం**

**గోషామహల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** అసాంఘీక కార్యక్రమాలను అరికట్టేందుకు అనునిత్యం అప్రమత్తంగా ఉంటున్నామని గోషామహల్ అసిస్టెంట్ కమిషనర్ సుదర్శన్ అన్నారు. గోల్కొండ జోన్ డిసిపి చంద్ర మోహన్ ఆదేశాలమేరకు అఫ్జల్‌గంజ్ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం గోషామహల్ డివిజన్ ఎసిపి కార్యాలయంలో అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, డిఐ రవికిరణ్, ఎస్ఐలు నిరంజన్, సుబాష్ పోలీసు సిబ్బందితో కలిసి విలేకరుల సమావేశంలో ఎసిపి సుదర్శన్ మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రానికి చెందిన మౌని(40)వ్యవసాయ పనులు చేసుకుంటు గంజాయిన్ని నగరానికి సరఫరా చేస్తున్నాడు. ఒడిశా మల్కన్‌గిరి జిల్లా, కలిమెల ప్రాంతానికి చెందిన ఆశీష్‌శిక్టర్(60), భీమాజాలి(34)తోపాటు పరిచయం ఏర్పడింది. నగరానికి గంజాయిని సరఫరా చేయాలని మౌని ఇరువురికి సూచించారు. ఈనెల 13వ తేదిన ఆశీష్‌శిక్దర్, బీమాజాలికి పదికిల్లో గంజాయితోపాటు 5000వేల రూపాయలు ఇచ్చి పంపించాడు. గంజాయిన్ని తీసుకువస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు అఫ్జల్‌గంజ్ పోలీసులు మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ వద్ద నిఘా వేసి ఉంచారు. శనివారం గంజాయిన్ని తీసుకుని వచ్చి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇరువురిన్ని పోలీసులు పట్టుకున్ని విచారించగా వారి వద్ద పదిన్నర కిల్లో గంజాయి లభించింది. వారిని స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించగా పాత నేరస్థుడు మౌని సూచనల మేరకు తాము నగరానికి గంజాయి తీసుకువచ్చినట్లు పోలీసుల ముందు అంగీకరించినట్లు తెలిపారు. ఎన్‌డిపిఎస్ యాక్టు-1985, 8(సి), ఆర్/డబ్లు.20(బి)(ii)(బి)కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మౌని పరారీలో ఉన్నట్లు తెలిపారు. చాకచాక్యంగా నిఘావేసి పట్టుకున్న అఫ్జల్‌గంజ్ పోలీసు సిఐలకు, ఎస్ఐలకు, పోలీసు సిబ్బందికి డిసిపి చంద్రమోహన్ రివార్డు అందచేయనున్నట్లు చెప్పారు. కేసును అఫ్జల్‌గంజ్ పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.




మాట్లాడుతున్న గోషామహల్ ఎసిపి సుదర్శన్



అరటి పండ్లు, కమలాల పంపిణీ చేస్తున్న వి.హనుమంతరావు

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో పండ్లు పంపిణీ

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15(ప్రభాతవార్త) :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చిక్కడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం అరటి పండ్లు, కమలాల పంపిణీకార్యక్రమం టీపీసీసీ లింగ్విస్టిక్ మైనారిటీసెల్ నాయకుడు, సీనియర్ కాంగ్రెస్ నేత రాజేష్అగర్వాల్, రోషన్‌లాల్ అగర్వాల్ ఫౌండేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ వి.హనుమంతరావు హాజరై, పండ్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్వదినాల వేళ ఇలాంటి సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఉదయ్‌రాజ్, రూపేష్‌కుమార్, విశాల్ అగర్వాల్, రఘువీర్, నాగరాజ్, లక్ష్మణ్‌యాదవ్, బీబ్లాక్ అధ్యక్షుడు అంజి యాదవ్, లక్ష్మణ్‌వర్మ, రాజు మున్నూరు, నర్సింగ్‌రావు, మాజీ కార్పొరేటర్ పాలూస బాలరాజ్‌గౌడ్, నరేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహా శివరాత్రి వేడుకలు



మహా శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి జోన్ పాపిరెడ్డినగర్‌లోగల వీరంజనేయ శివాలయంలో ఆదివారం మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఇతర నేతలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేతోపాటు ఇతర నేతలను శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నార్నే శ్రీనివాస్‌రావు, శ్రీకాంత్, సీనియర్‌నేతలు నాయినేని చంద్రకాంత్ రావు, ఆలయ చైర్మన్ ధర్మరావు, అధ్యక్షుడు ఆడెపు ప్రభాకర్, బస్తి ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింహులు నేతలు రాపోలు తిరుపతిరెడ్డి, పి.శంకర్‌రెడ్డి, తాటి కిరణ్, వనం ఆంజనేయులు పాల్గొన్నారు.

### శివాలయంలో పూజలు చేసిన వడ్డేపల్లి...



ప్రత్యేక పూజల్లో వడ్డేపల్లి

**కూకట్‌పల్లి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని దీనబంధు కాలనీ శివభక్త మార్కండేయ స్వామి ఆలయం, ఆల్విన్ కాలనీ ఫేస్ 2లోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాలలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజాకార్యక్రమాలలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని పరమశివుని దివ్య దర్శనాన్ని గావించారు. ఈ సందర్భంగా శివయ్యకు అభిషేకం చేసి, గోత్ర నామార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరమశివుని కృపతో ప్రజలు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వర్‌ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, బిజెపి నాయకులు రామరాజు, నర్సింగ్, కార్యకర్తలు, భక్తులు పాల్గొని శివనామస్మరణతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## లక్ష్మీగణపతి దేవాలయంలో షెడ్డు ప్రారంభం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త):** ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నూతనంగా నిర్మించిన షెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. దేవాలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ హాజరై ప్రారంభించి ప్రసంగించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత పూస రాజు, బిఆర్ఎస్ యువనేత ముఠా జయసింహ, స్థానిక మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులను ఈ సందర్భంగా అతిథులు కొనియాడారు.

## కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

### బిఎంఎస్ జాతీయ అధ్యక్షుడు మల్లేశం

**చిక్కడపల్లి ఫిబ్రవరి 15(ప్రభాతవార్త):** జాతీయ స్థాయిలో కార్మికులకు సంబంధించిన సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతానని భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు ఎస్.మల్లేశం అన్నారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సంఘ్ ప్రధాన కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా జిహెచ్ఎంసి మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ ఆధ్వర్యంలో మల్లేశంను సత్కరించి అభినందించారు. కార్మికులకు అండగా ఉంటూ వారి కోసం పని చేస్తానని అన్నారు. టి.కృష్ణ మాట్లాడుతూ కార్మిక రంగంలో 45 ఏళ్ల సుదీర్ఘ అనుభవం, అకుంఠిత దీక్షతో కార్మిక సంక్షేమానికి అంకితమైన నాయకుడు ఎస్ మల్లేశం అని అన్నారు. నాలుగున్నర దశాబ్దాల నిరంతర కృషి పోరాట స్ఫూర్తితో జాతీయ స్థాయికి ఎదిగారన్నారు. న్యాయవాదిగా న్యాయపరమైన అవగాహనతో చర్చల ద్వారా పరిష్కారాలకు ప్రాధాన్యం ఇచ్చి అత్యధిక వేతన ఒప్పందాలు సాధించారన్నారు. "కార్మికుల ప్రయోజనాల కోసం దేశం దేశ ప్రయోజనాల కోసం కార్మికులు" అనే బి ఎం ఎస్ మూల సిద్ధాంతానికి నిబద్ధుడైన ఆయన యువ నాయకులకు మార్గదర్శకం అని అన్నారు. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్రంలో, జాతీయంగా అనేక బాధ్యతలు నిర్వర్తించి, ఈ పిఎఫ్ సెంట్రల్ బోర్డు మెంబర్ సేవలందించి, నేడు జాతీయ అధ్యక్ష పదవిని అలంకరించడం తెలంగాణ కార్మిక లోకానికి విశేష గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామ్మోహన్ గారు, సీనియర్ నాయకులు జయందర్ , వైస్ ప్రెసిడెంట్ ఎం.రాధాకృష్ణ, అడిషనల్ జనరల్ సెక్రటరీ ఎస్.ప్రదుమన్, నాయకులు రూపేష్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.



మల్లేశంను సత్కరిస్తున్న టి.కృష్ణ తదితరులు

# వైభవంగా మహా శివరాత్రి వేడుకలు

**నార్సింగి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** గండిపేట మండలంలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. మండలంలోని నార్సింగి సర్కిల్, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధుల్లోఉన్న శివాలయాలన్నీ వేలాది మంది భక్తజనులతో కిటకిటలాడాయి. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులు శివలింగా లకు జల, పాల, పళ్ల, ఆకుల అభిషేకాలు చేసేందుకు ఎగబడ్డారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సాంప్రదాయబద్ధంగా పూజారులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల నిర్వాహకులు భక్తుల తాకిడిని ముందుగానే అంచన వేసి భారీ ఏర్పాట్లుచేశారు. కిస్మత్‌పూర్‌లోని శ్రీకృష్ణఆలయం, బండ్లగూడలోని కాళీమందిర్, హైదర్షాకోట్‌లోని విజయగణపతి ఆలయం, గంధంగూడలోని వెంకటేశ్వరాలయం, మణికొండ, పుప్పాలగూడలోని శివాలయాలు, మంచిరేవులలోని మచిలేశ్వరాలయం, ఖానాపూర్ రాజన్నగుట్టల వద్ద పెద్దఎత్తున భక్తజనులు పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిదులు పాల్గొని భక్తులను ఉత్సాహపరిచారు. మంచిరేవులలోని మచిలేశ్వరస్వామి ఆలయంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణుగౌడ్, మాజీమేయర్ మహేందర్ గౌడ్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్‌యాదవ్, జి.నాగేష్‌యాదవ్, ప్రవీణ్‌యాదవ్,గణేష్, ప్రశాంత్‌యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పద్మావతి పాపయ్యయాదవ్, సాగర్‌గౌడ్, శ్రీలత సురేష్‌గౌడ్ శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నార్సింగి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్లు రేఖయాదగిరి, నాగపూర్ణ శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్లు వెంకటేష్ యాదవ్, విజయ్‌కుమార్, కౌన్సిలర్లు జి.శివారెడ్డి, పత్తి శ్రీకాంత్, విజిత ప్రశాంత్‌యాదవ్, ఉషారాణి, కిరణ్, అమరేందర్‌రెడ్డి, యాదమ్మ తదితరులు, మణికొండ లో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు తదిత రులు శివరాత్రి వేడుకల్లో పాల్గొని తరించారు.

**ప్రత్యేక పూజలు చేసిన పీసీసీ అధ్యక్షులు మహేష్‌గౌడ్...**

గండిపేట మండలం మంచిరేవులలోఉన్న మహి మాన్విత మచిలేశ్వరస్వామికి శివరాత్రిని పురస్కరిం చుకొని పీసీసీ అధ్యక్షులు మహేష్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్‌నాయకులు, కార్య కర్తలతో కలిసి వచ్చిన ఆయన సాంప్రదాయబద్ధంగా దుస్తులు ధరించి పూజలు చేశారు.

**భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు**

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** 'హర హర మహాదేవ...శంభోశంకర' అంటూ పాతబస్తీ వ్యాప్తంగా గల శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మారుమ్రోగాయి. భక్తులు తెల్లవారు జాము నుండే బ్రాహ్మీ ముహూర్తంలో భోలాశంకరుని దర్శనానికి ఆలయాలవద్ద బారులు తీరారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని ఆదివారం పాతనగరవ్యాప్తంగా ప్రజలు భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. కుటుంబ సభ్యులతో కఠోర ఉపవాస దీక్ష పాటిస్తూ శివనామ స్మరణలో గడిపారు. సాయంత్రం పరమశివునికి గంగాజలం, పండ్ల రసాలతో అభిషేకం, బిల్వార్చన పూజలు చేసి ప్రీతిపాత్రమైన ఖర్జూరం, వివిధ రకాల ఫలాలను నైవేద్యంగా సమర్పించారు. రాత్రంతా జాగరణ చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. శివాలయాలలో ఆదిదేవునికి విశేష పూజలు నిర్వహించారు. కేశవగిరిపై గల అతిపురాతన శివాలయంలో మహాదేవునికి మహాన్యాస రుద్రాభిషేకం, రుద్రహోమం, భజనలు నిర్వహించారు. మహా శివరాత్రి ఘడియలలో శివపార్వతుల కల్యాణం కమనీయం రమణీయంగా జరిగింది. శ్రీ భ్రమరాంబదేవి సమేత చెన్న మల్లికార్జున స్వామి దేవాలయంలోని స్వయంభుః మూల విరాటుకు, బ్రహ్మసూత్ర శివలింగానికి రోజంతా విశేష పూజలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర ఖర్జూర అర్చన, భస్మాభిషేకం, కోటి తిలార్చన, లింగోద్భవ కాలంలో స్వామికి అన్నాభిషేకం, 21 రకాల విశేష ద్రవ్యాలతో అభిషేక పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కోటి హరీష్‌కుమార్ చేపట్టారు. ఉప్పుగూడ శ్రీమహంకాళి మరకత లింగేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం 4గంటలకు మరకత లింగేశ్వరస్వామికి



లక్ష్మీగణపతి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకం, భక్తులచే సామూహిక పంచామృత అభిషేకం, ప్రదోషకాల మహా రుద్రాభిషేకం, రాత్రికి శ్రీ శివపార్వతుల కల్యాణ మహోత్సవం, లింగోద్భవకాలం, ఏకవార రుద్రాభిషేకం పూజలు జరిగాయి. లాల్‌దర్వాజాలోని ప్రాచీన శ్రీపిచ్చేశ్వర నాగేశ్వర శివ పంచాయతన దేవాలయంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కాకునూరి సూర్యనారాయణమూర్తి నమక చమకాలతో స్వామికి పూజలు చేశారు. రాజన్నబావి శ్రీ తుల్జా భవానీ దేవాలయంలో అమ్మవారిని కైలాసనాథునిగా అలంకరించారు. ఆలయ అర్చకులు రంగాచార్య కులకర్ణి భక్తులచే స్వామికి విశేష పూజలు జరిపించారు. కందికల్ గేట్ శ్రీ చిత్రగుప్త దేవాలయంలోని శివాలయం, ఛత్రినాక శివగంగానగర్ శ్రీలక్ష్మణేశ్వరస్వామిదేవాలయం, అయోధ్య నగర్ శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలోని శ్రీ శివాలయం, రక్షాపురం శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవాలయం తదితర ఆలయాలలో దేవదేవునికి పూజలు, నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం తొనికిసలాడింది. మహాదేవుని పండుగను పురస్కరించుకొని శివాలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మార్కెట్లు పూలు, పండ్లు, పత్రులు, పూజా సామాగ్రి విక్రయాలతో కిటకిటలాడాయి. ఇక పండ్ల ధరలు మునుపెన్నడు లేన్నట్లు భక్తులకు చుక్కలు చూపాయి.



మచిలేశ్వరస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**లక్ష్మీగణపతి దేవాలయంలో...**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లో శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజాకార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఆలయ పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు, ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉదయం నుండి ఏకవారరుద్రాభిషేక మహోత్సవాలు, స్వర్ణపుష్పార్చనలు, అనంతరం ఉమా మహేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. అనంతరం మహాన్యాసపూర్వక రుద్రాభిషేక మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, గాంధీనగర్ మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీ క్షీరలింగేశ్వరస్వామివారి దర్శించుకుని పెద్దసంఖ్యలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జిల్లా శివకుమార్, మీసాల రాజేష్, డి భానుచందర్, గడప భాగ్యలక్ష్మి, సాయికీర్త్, గిరిబాబు, గుర్రం దినేష్, బండారి నవీన్ కుమార్, పి సురేష్ యాదవ్, గుండ్ల గజానంద్, ఎం గణేష్, జి.లలిత, రామకృష్ణ, జి శ్రీనివాస్, శివకుమార్, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

### ఘంటసాల తెలుగు సినీ గానవైభవం

## గ్రంథ రచయిత ధర్మారావుకు సన్మానం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త) :**

అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గాన మాధుర్యాన్ని, సినీ సంగీత వైభవాన్ని భావితరాలకు అందిస్తున్న గొప్ప వ్యక్తి ప్రముఖ పరిశోధకులు, ఘంటసాల తెలుగు సినీ గాన వైభవం గ్రంథ రచయిత సంస్కృతిరత్న డాక్టర్ కె .ధర్మారావుకె దక్కుతుందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం బాగ్ లింగంపల్లి లోని ఫాస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ధర్మారావు వివరాలు వెల్లడించారు. ఘంటసాల గాన విశిష్టతను విశ్లేషిస్తూ తాను రాసిన గ్రంథాన్ని అభిమానులు ఇంతగా ఆదరిం చడం, ముఖ్యంగా కొండయ్య వంటి వీరాభిమానుల సమక్షంలో సన్మానం జరగడం ఎంతో సంతోషాన్ని, తృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. ఘంటసాల అభిమానిగా, ఘంటసాల విగ్రహ స్థాపనలో కీలక పాత్ర పోషించిన గుంటూరు పట్టణ లాడ్జీ యజమానుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు పొన్నగంటి కొండయ్య, సామాజిక సేవా ప్రముఖుడు చిరుతనగండల ఆంజనేయులు ఆధ్వ ర్యంలో తనకు జరిగిన సన్మానం జీవితంలో మరిచిపోలేనిదన్నారు. ఫాస్ , ఇట్మా ఫిలిం సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడిగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ధర్మారావు మరిన్ని సత్కారాలు, సన్మానాలు పొందాలని ఆకాంక్షి ంచారు.

### గౌరవ డాక్టరేట్లు పొందిన వారిని సత్కరించిన ఎమ్మెల్యే

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మహాత్మా గాంధేయవాద సిద్ధాంతాన్ని ప్రోత్సహించేవారికి గౌరవ డాక్టరేట్లు అందించే ప్రముఖ అమెరికన్ సంస్థ మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ (ఎం.జీ.జీ.పీ) ద్వారా గౌరవ డాక్టరేట్లు సాధించిన డాక్టర్ గుడిదేవిని ప్రభాకర్‌గౌడ్, డాక్టర్ సయ్యద్ ఉస్మాన్ అజార్, డాక్టర్ యడ్ల మధుకర్‌లను సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావుగౌడ్ ఘనంగా సత్కరించారు. ఆదివారం మోండా మార్కెట్ లోని తన నివాసంలో వారిని సత్కరించి డాక్టరేట్ సర్టిఫికెట్ లను అందించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ మానవతా విలువల పరిరక్షణ, గాంధేయ వాద సిద్ధాంతల రక్షణ కు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సి ఉందని అన్నారు. శాంతి, మానవత్వం యొక్క తత్వ శాస్త్రం ఆధారంగా గౌరవ డాక్టరేట్లు అందించడం ప్రశంసనీయమని అన్నారు. డాక్టరేట్లు పొందిన డాక్టర్ గుడిదేవిని ప్రభాకర్ గౌడ్, డాక్టర్ సయ్యద్ ఉస్మాన్ అజార్, డాక్టర్ యడ్ల మధుకర్ లను పద్మారావు గౌడ్ అభినందించారు. ఏం.జీ.జీ.పీ. ప్రతినిధులు డాక్టర్ మైక్ లిట్‌మాన్, గీళీతి (గ్లోబల్ డైరెక్టర్) డా. హృషికేస్ ఆచార్య (ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్), డాక్టర్ సుప్రజా శ్రీనివాస్ ల పక్షాన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అనురాధకు డాక్టరేట్ ప్రదానం

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**

బాలల హక్కుల పరిరక్షణలో విశేష సేవలందిస్తున్న రెయిన్‌బో హోమ్స్ ప్రోగ్రామ్ వ్యవస్థాపక సభ్యురాలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి అనురాధ కొంకెపూడికి హెన్రీ మార్టిన్ ఇన్స్టిట్యూట్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బాలల సంక్షేమం కోసం ఆమె గత అనేక సంవత్సరాలుగా అంకితభావంతో చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని అందజేశారు.ఈ సందర్భంగా రెయిన్‌బో హోమ్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రామ్ భాగస్వామ్య సంస్థలు కలిసి కే.అనురాధను సత్కరించి, అభినందనలు తెలిపారు. నిరాశ్రయ, అణగారిన, అట్టడుగు వర్గాల పిల్లలకు సురక్షిత ఆశ్రయం, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడంలో ఆమె చేసిన కృషి సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల డైరెక్టర్లు నవీన్ రాజ్, నాగ రాజా, శ్రీనివాస్ రెడ్డి, జయశ్రీ, క్రాంతి కిషోర్, అంబికా, ఇందిరా, ఎల్లయ్య, నమత, సుజాత, శివరాణి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. రెయిన్‌బో హోమ్స్ ప్రోగ్రామ్ జాతీయ డైరెక్టర్లు శ్రీలత, మెహర్, సత్య, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్లు అరుణమై, నిరంజన్, సుధారాణి, ఆరీఫ్, సురేష్, విజయ్ రాజ్, హైదరాబాద్ సిటీ డెస్క్ మేనేజర్లు క్రాంతి కిరణ్, శివ వివిధ భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### పాతబస్తీలో

## భక్తి శ్రద్ధలతో శివరాత్రి మహోత్సవాలు

**చార్మినార్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** పాతనగరంలోని పలు శివాలయాలలో ఆదివారం అత్యంత వైభవంగా శివరాత్రి మహోత్సవాలు జరిగాయి. వేలాది మంది భక్తులు శివరాత్రి సందర్భంగా శ్రీ పరమ శివునికి పూజలు నిర్వహించటానికి తరలి వచ్చారు. పాతబస్తీలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటలు వరకు భక్తులు శివమందిరాలలో అభిషేకాలు,పూజలు జరిపారు. చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరంలో భక్తులకు దేవాలయం ఆధ్వర్యంలో రుద్రాక్షలు పంపిణీ చేశారు. వేలాది మంది భక్తులు చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరంలో అత్యంత భక్తి శ్రద్దలతో పార్వతీ పరమేశ్వరులకు పూజలు నిర్వహించారు. చార్‌కమాన్ షరాఫా అండ్ జెవెల్లర్స్ అసోసియేషన్ చైర్మన్ అజయ్ కుమార్ అగర్వాల్ దంపతులు శివమందిరంలో అభిషేకం, పూజలు జరిపారు. చేలాపుర బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఘాన్సీ బజార్‌లోని వైదిక వచనాలయంలో 12 జ్యోతిర్లింగాల దివ్య దర్శన్‌ను ఏర్పాటు చేశారు. ఘాన్సీ బజార్‌కు చెందిన భక్తులు 12 జ్యోతిర్లింగాల దివ్య దర్శన్‌ను తిలకించారు. బెంగాలీ యంగ్ స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘాన్సీ బజార్‌లోని గాయత్రీ భవన్‌లో ఆదివారం శ్రీ శివపార్వతుల కళ్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జగన్నాద్ అధక్‌తోపాటు వందలాదిమంది బెంగాలీలు పాల్గొన్నారు. కిషన్‌బాగ్‌లోని కాశీబుగ్గ శివాలయంలో మహశివరాత్రి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. జంట నగరాలలోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు శివ మందిరానికి రావటంతో మందిరం పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. పురానాపూల్, దూద్‌బౌలి, చార్‌కమాన్, చేలాపుర, తాడ్‌బన్, హుస్సేనీ ఆలం, కోకరివాడి, షక్కర్‌కోట, షంషేర్‌గంజ్‌తో పాటు పాతనగరంలోని అన్ని శివాలయాలలో ఆదివారం శివరాత్రి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. కాగా శివరాత్రి మహోత్సవాలు సందర్భంగా అన్ని శివాలయాలు వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## భక్తులకు పండ్లు పంపిణీ చేసిన విద్యార్థి నేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** మహాశివరాత్రి సందర్భంగా ఉపవాసం ఉన్న భక్తులకు తెలంగాణ విద్యార్థి జెఏసి చైర్మన్ వేముల రామకృష్ణ పండ్ల పంపిణీ చేశారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆయన భారీ ఎత్తున వివిధ రకాల పండ్లను ఉచితంగా పంపిణీ చేశారు. అంతకు ముందు ఆయన ఆలయంలో కొలువుతీరిన పరమశివుడికి చక్కెర,పాలు, పెరుగు, నెయ్యి, తేనెతో అభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, ఈ.శ్రీకాంత్, గణేష్, జగదీష్, సుస్మిత, విగ్నేశ్వరి, చరణ్, వసంత్, లల్లు వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు పండ్లు పంపిణి చేస్తున్న విద్యార్థి జెఏసి చైర్మన్ వేముల రామకృష్ణ



భోగ్‌బండార్‌లో పాల్గొన్న నాయకులు

## సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి

**దుండిగల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు ఆదివారం దుండిగల్ సర్కిల్ పరిధిలో ఘనంగా నిర్వహించబడ్డాయి. బంజారా సమాజ ఆరాధ్య దైవం అయిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని తాండ-1, తాండ-2, గాగిల్లాపూర్ తాండల్లో భోగ్‌బండార్ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ పూజారులు శంకర్ భావాలాల్ మహారాజ్, వెంకటేష్ మహారాజ్ ఆధ్వర్యంలో, మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ సమన్వయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, భజనలు, మంగళహారతులు నిర్వహించి సేవాలాల్ మహారాజ్ బోధనలు స్మరించుకున్నారు. అనంతరం మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ కుమారుడు జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శంభీపూర్ కృష్ణ, దుండిగల్ సీఐ సతీష్, ఎస్ఐలు రంజిత్ రెడ్డి, రామ్ మోహన్ రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, రవీందర్ నాయక్, ప్రవీణ్ నాయక్, హనుమంతు నాయక్, శివా నాయక్, శ్రీశైలంయాదవ్, మల్లేష్‌యాదవ్, దశరథ్‌నాయక్, నగేష్, అశోక్‌కుమార్, వినయ్, ధనరాజ్, విజయ్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

**అమీర్‌పేటలో...**



సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవులు ప్రకటించాలని ఆదివారం సోమ్లా సాయిరామ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బంజారా సమాజ ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు అమీర్‌పేట్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమీపంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని సోమ్లా సాయిరామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ జనరల్ సెక్రటరీ, గిరిజన మోర్చా మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా నాయకుడు హేమంత్ నాయక్, ఎస్టీ మోర్చా అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు రాజు గౌడ్, దుర్గాడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమ్లా సాయిరామ్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15న సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు ప్రకటించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బంజారా సమాజానికి సేవాలాల్ మహారాజ్ చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం గౌరవం ఇవ్వాలని కోరారు.

## పరమేశ్వరుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**నిజాంపేట్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** మహాశివరాత్రి సందర్భంగా ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం శ్రీఅభయాంజనేయ స్వామి వారి ఆలయం, నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప ఉమామహేశ్వరస్వామి, శ్రీశ్రీ నల్లపోచమ్మ దేవాలయం, మధురనగర్ సాయిబాబా ఆలయాలలో ఆ పరమేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ పరమేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

# బహుముఖ ప్రజ్ఞాశాలి ఆదర్శనీయుడు రమణాచారి

### హర్యానా రాష్ట్ర పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయ

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :**

డా. కె.వి.రమణాచారి ప్రతిభావంతుడైన ఐఎఎస్ అధికారి మాత్రమేకాదు ఆయనొక మంచి కవి, సాహితీవేత్త, ఆధ్యాత్మికత, సామాజిక, దైవచింతన, కళాపోషకుడు, కళాసేవకుడు, మంచి భావోద్వేగంతో కూడిన విషయ పరిజ్ఞానానికి నిలువెత్తు నిదర్శనమైన బహుముఖ ప్రజ్ఞాశీలి, ఆదర్శనీయుడని హర్యానా రాష్ట్ర పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయ అన్నారు. ఆయన నిరంతర సేవలు ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఎంతో అవసరమని, ఆయన్ను సన్మానించడమంటే తెలంగాణ సాహిత్య, ఆధ్యాత్మికత, భావాన్ని, సంస్కృతి సంప్రదాయాలను సన్మానించినట్లు భావిస్తున్నానని స్పష్టం చేశారు. అందరి మెప్పుపొందిన అరుదైన ఐఎఎస్ అధికారిగా, టిటిడి చైర్మన్‌గా అనేక రాజకీయ అనుభవాలతో సమాజంలో నిలదొక్కుకొని పనిచేస్తూ అసామాన్యమని, అతని నెలసరి పెన్షనే ఆయన ఆస్తి అని, నేడు ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయుడు, ఆదరణీయుడని కొనియాడారు. జి.వి.ఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఆదివారం రాత్రి పొత్తూరి సుబ్బారావు సభాధ్యక్షతన తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణ 75వ జన్మదినం అమృతోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బండారు దత్తాత్రేయ విశిష్ట అతిథులు బైస దేవదాసు, శిరోమణి డా.వంశీ రామరాజు, డా, పులివర్తి కృష్ణమూర్తి, పెద్దూరి వెంకటదాసు, డి.హనుమంతరావు, సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి లయన్ వి.వి.రాఘవరెడ్డితో కలిసి ముందుగా కె.వి.రమణాచారి, పుష్పలత దంపతులను ఆత్మీయ సత్కారం కావించి అమృతోత్సవ శుభాకాంక్షలు తెలిపి అనంతరం సాధన సాహితీ స్రవంతి వ్యవస్థాపకుడు సాధన నరసింహాచార్యులను ఘనంగా సన్మానించి డా. కె.వి.రమణ ఎక్సలెన్సీ అవార్డు ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. సభకుముందు దాంపత్యం అనే అంశంపై జరిగిన కవిసమ్మేళనం ఆహుతులను ఎంతగానో ఆలోచింపజేసి స్ఫూర్తిగా నిలిచింది.



కె.వి.రమణ, పుష్పలత దంపతులకు సత్కరిస్తున్న దత్తాత్రేయ, రాఘవరెడ్డి తదితరులు



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న పరశురామ్‌రెడ్డి తదితరులు

## రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గం లోని 137వ డివిజన్ కాకతీయనగర్‌లో గౌరీశంకర్ చౌరస్తా నుంచి వాయు పురి వరకు నిర్మాణంలోఉన్న సీసీ రోడ్డు పనులను బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ బద్దం పరశురామ్‌రెడ్డి ఆదివారం పర్యవేక్షించారు. పనుల పురోగతిని సమీ క్షించి, నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారు లకు సూచించారు. ప్రాంత ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పిం చడమే లక్ష్యంగా ఈ రహదారి పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా మన్నికైన నిర్మా ణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో డివిజన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గుప్తా, సీనియర్ నాయకులు గుత్తి రాంచందర్, ప్రభాకర్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

## శివరాత్రి వేడుకల్లో దిడ్డి రాంబాబు



పూజలు నిర్వహిస్తున్న జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** బర్కత్‌పుర డివిజన్‌లోని పలు ఆలయాల్లో జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో శివరాత్రి ఏర్పాట్లపై ఆయన అడిగి తెలుసుకున్నారు. లింగంపల్లి, బర్కత్‌పుర, వీరన్నగుట్ట, ఇందిరా నగర్, రత్నానగర్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు యాదాద్రి భవనం నుంచి ప్రారంభమైన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి అఖండ జ్యోతి రథయాత్ర కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

## ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి : ఎమ్మెల్యే



గణేష్ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**అడ్డగుట్ట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** శివపార్వతుల అనుగ్రహంతో ప్రజలు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో జీవించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని గణేష్ టెంపుల్, కార్ఖానా, కాకగూడ పరిసర ప్రాంతాల్లోని హన్‌మాన్,శివాలయాల్లో నిర్వ హించిన వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ టెంపుల్ చైర్మన్ పి.ప్రభాకర్ యాదవ్ (అరవింద్ యాదవ్),ఈఓ రామక్రిష్ణలు ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఘన స్వాగతం పలికి వేదపండితుల చేత ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి వేడుకల్లో జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ 1,2,6 వార్డులలోని పలు దేవాలయాల్లో నిర్వహించిన పూజల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## శివాలయాల్లో పూజలు చేసిన భానుక నర్మద

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** కంటోన్మెంట్‌లోని వివిధ దేవాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఘనంగా మహా శివరాత్రి వేడుకలు



భూమేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 4వ వార్డు పికెట్ బజార్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీపంచభూత భూమేశ్వరస్వామి, శివపంచాయతన శివాలయంలో ఆదివారం తెల్లవారు జాము నుంచి మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి భూమేశ్వర స్వామి,శివపంచాయతన శివాలయంలో స్వామిారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు జెట్టి ఉమా మహేశ్వర్‌రావ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.

### సుబ్రమణ్యస్వామి ఆలయంలో...

**అడ్డగుట్ట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన సుబ్రమణ్యస్వామి దేవాలయంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ఈఓ సుధాకర్, ఆలయ ప్రధాన అర్చకులు రాజేశ్వర శర్మల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మెంబర్ బానుక నర్మధ, సీనియర్ కాంగ్రెస్ నేతలు సి.సంతోష్ యాదవ్, వైష్ణవి యాదవ్ (గొల్లకిట్టు),బద్రి యాదవ్‌లో పాటు వందలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సికింద్రాబాద్ గురుద్వార ఆలయంలో నిర్వహించిన షాహిద్ దివస్ విసేష్ కీర్తన్‌లో పాల్గొన్న సిఖ్ మత పెద్దలు

# హైకోర్టు తీర్పు తరువాతే ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు నిర్వహించాలి

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

**ముషీరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** హైకోర్టు తీర్పు తరువాతనే ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 14 బీసీ సంఘాలతో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, జి. అనంతయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలను ఇప్పటివరకు అడుగడుగునా అన్నింట్లో తొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేసిన తరువాతే ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షం రాష్ట్రం బీసీల ఆగ్రహజ్వాలతో అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసిన తరువాతే ఎన్నికలకు వెళ్తామని చెబుతూనే మోసం చేసి, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి, బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. హైకోర్టులో ఉన్న కేసులను వాదించటానికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న అద్వకేట్లను నియమించాలని, న్యాయం మావైపు ఉంది కాబట్టి తప్పకుండా కేసులు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు దాదాపు 70 సార్లు ఢిల్లీ వెళ్లారు, కానీ ఒక్కసారి కూడా బీసీల గురించి ప్రధాన మంత్రిని కలవలేదని, కనీసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లలేదని ఆరోపించారు. గతంలో పోరాటాలుచేస్తే ముఖ్యమంత్రులు అందరూ స్పందించి, బీసీలకు న్యాయం చేశారని, ఇప్పటి ముఖ్యమంత్రి మాత్రం బీసీలను పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. బీసీలు ఓట్లు వేసే యంత్రాలు కాదని ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తించాలని, తక్షణమే స్పందించి, చైర్మన్‌ల ఎంపికలో బీసీలకు 50శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేత రాజేందర్‌ముదిరాజ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీష్, కన్వీనర్ రాందేవ్ మోడీ, రాంకోటి ముదిరాజ్, శివకుమార్‌యాదవ్, భీంరాజ్, కృష్ణ, అంజిగౌడ్, దాసోజు భాస్కర్‌చారి పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు...

**బేగంబజార్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పరమశివునికి ఇష్టమైన రోజు కావడంతో శివభక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. హర నామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. పురానాపూల్‌లోని మూసినది ప్రహరీ అనుకుని ఉన్న శివాలయంలో నగరం నలుమూల నుంచి భక్తులు తరలివచ్చి అభిషేకాలు, ప్రత్యేక పూజలను చేశారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులను క్యూలో పంపించారు. కాగా చిన్నబజార్‌లోని బాల భక్తవీర్ సమాజ్ ఆధ్వర్యంలో శివాలయంలో తెలంగాణ లింగ్విస్టిక్‌మైనార్టీ సెల్ యూత్ చైర్మన్ అశోక్ మురళీమోహన్‌సింగ్ శివునికి ప్రత్యేక పూజలను చేశారు. అబిడ్స్‌లోని ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదే విధంగా పురానాపూల్‌లోని కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ పూజారి సంతోష్‌ఆచార్యులు అమ్మవారికి అభిషేకం, కుంకమార్చన తదితర పూజలను చేశారు

### మహాశివరాత్రి కావడంతో అధిక ధరలకు విక్రయించిన పండ్లు

**అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** నగరంలోని పలు మార్కెట్‌లో పండ్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. మహాశివరాత్రికి ఉపవాస దీక్షలు పాటించే భక్తులు వివిధ పండ్లలో సాయ ంత్రం వేళ్ల ఉపవాస దీక్షలు విరమి స్తుంటారు. అఫ్జల్‌గంజ్, ఎం.జెమార్కెట్,సుల్తాన్‌బజార్, బేగంబజార్, పురానాపూల్ తదితర ప్రాంతాలలో పండ్ల వ్యాపారులు అధిక ధరలకు విక్రయించారు. పుచ్చకాయలు, అపిల్లు, అరటిపండ్లు, ద్రాక్ష,బత్తాయి తదితర పండ్లతోపాటు కజ్జూరపండ్లను అధిక ధరలకు విక్రయించారు. డజన్ అపిల్లు పండ్లు 120 రూపాయలనుంచి రెండువందల వరకు విక్రయించారు. అరటిపండ్లు రూ. 30 రూ. 40 చొప్పున విక్రయించారు. దీంతో కొనుగోలు దారులు చేసేది ఏమిలేక పండ్లను కొనుగోలు చేశారు. పువ్వులను అధిక ధరలకు విక్రయించారు. కొనుగోలుదారులతో మార్కెట్లు సైతం కిటకిటలాడాయి.

### కెపిహెచ్‌బి కాలనీ శ్రీ ఏకాంబదేశ్వర దేవాలయంలో...

**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** కెపిహెచ్‌బి కాలనీ రోడ్డు నెంబర్ మూడులో గల శ్రీ ఏకాంబదేశ్వర దేవాలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పివి శ్రీరామన ఆధ్వర్యంలో ఆలయాన్ని అందమైన విద్యుత్ దీపాలతో అలంకరించి కాలనీలోనే అత్యంత శోభాయమానంగా తీర్చిదిద్దడంతో స్థానిక కాలనీవాసులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలలో పెద్ద ఎత్తున శివుడు త్రిశూలం ఆకారంలో మూర్తులను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆలయంలో తెల్లవారుజామున 3 గంటల నుండి శివుడికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించగా భక్తులు తెల్లవారుజామునుండే క్యూ కట్టి స్వామివారిని దర్శించుకున్నారు.

### సీతారాంనగర్‌లో...

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవాం:** సీతారాంనగర్‌లోని శ్రీరామ లింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే దేవాలయంగా పేరుపొందిన ఈ ఆలయానికి ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ నోముల ప్రకాష్‌రావుగౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు జరిపారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ నోముల ప్రకాష్‌రావు తెలిపారు.

## గురుబ్రహ్మనగర్‌లో సేవాలాల్ జయంతి వేడుకలు

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ గురుబ్రహ్మనగర్‌లో సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఫిల్మ్‌నగర్ 18బస్తీల అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు, జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కాటూరి రమేష, బస్తీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తార్నాకకు చేరుకున్న శ్రీలక్ష్మినరసింహస్వామి అఖండ జ్యోతి యాత్ర

**తార్నాక, జనవరి 15 ప్రభాతవార్త :** శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి 32వ అఖండ జ్యోతి యాత్ర ఆదివారం భక్తి శ్రద్ధల నడుమ బర్కత్‌పుర యాదాద్రి భవన్ నుంచి ప్రారంభమై తార్నాక చౌరస్తాకు చేరుకుంది. యాత్ర సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులతో పాటు సన్మాన్ హోటల్ యజమాని విశ్వనాధరావు, సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, బీజేపీ సీనియర్ నాయకుడు వెంకటేష్‌గౌడ్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. స్వామివారి దీవెనలతో ప్రజలు సుఖశాంతులతో, ఐశ్వర్యం, సంపదలతో జీవించాలని వారు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణమూర్తి, కరుణాకర్, రాముడర్మ, భాను, శ్రీకాంత్, దేవుడుకుమార్, గౌతమ్, వనమాల శ్రీను పాల్గొని అఖండజ్యోతిని దర్శించుకున్నారు. భక్తి గీతాలు, జై నినాదాలతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.



అఖండ జ్యోతికి ప్రత్యే పూజలు చేస్తున్న బిజేపీ శ్రేణులు

### ఎగ్జిబిషన్ ఆదాయంతో బాలికలకు

## విద్య అందించడం అభినందనీయం : గుత్తా సుఖేందర్‌రెడ్డి

**గన్‌ఫౌండ్రి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** ప్రతి ఏటా అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనతో వచ్చే ఆదాయంతో ఎగ్జిబిషన్ సొసైటీ బాలికల విద్య కోసం పాటు పడటం అభినందనీయమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహిస్తున్న 85వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో భాగంగా అవార్డు ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే డబ్బుల ద్వారా విద్యాసంస్థలను నడిపించడం గర్వకారణమన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతియేటా కలిసికట్టుగా అఖిలభారత ప్రదర్శనను విజయవంతం చేయడం పట్ల వారిని ప్రత్యేక అభినందించారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయడం పట్ల అధికారులను అభినందించారు. గుత్తా చేతుల మీదుగా అదనపు డి.జి.పి డాక్టర్ సౌమ్యమిశ్రా వివిధ విభాగాలకు చెందిన అధికారులు అవార్డులను అందుకున్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి రాజేశ్వర్, ఉపాధ్యక్షులు సుఖేందర్‌రెడ్డి, సొసైటి ప్రతినిధులు చంద్రశేఖర్, ప్రభాశంకర్, సంజీవకుమార్, బి.హన్‌మంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 17న రమాబాయి అంబేద్కర్ పురస్కారాల ప్రదానోత్సవం

**ముషీరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ఈనెల 17వ తేదీన రవీంద్ర భారతి ఆడిటోరియంలో మాత రమాబాయి అంబేద్కర్ పురస్కారాల ప్రదానోత్సవం మాత రమాబాయి అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు బి.ఎన్.రత్న, కె.శ్రీకళ, కట్టెల గణేష్ తెలిపారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ పురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు సీతక్క, గడ్డం వివేక్‌వెంకటస్వామి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, విశిష్టఅతిథిగా రాజ్యసభ సభ్యులు విజయేంద్రప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు. వివిధరంగాలలో నిష్ణాతులైన ప్రముఖ రచయిత స్వర్గీయ గద్దర్ సతీమణి విమలగద్దర్, హక్కుల నేత స్వర్గీయ బొజ్జా తారకం సతీమణి బోయి విజయభారతి, అప్పికట్ల భరత్ భూషణ్ సతీమణి అప్పికట్ల నళిని, మంత్రి వివేక్ వెంకటస్వామి సతీమణి గడ్డం సరోజ, దళిత సేన జేపీ రాజు సతీమణి ఆకాశపు అచ్చ మాంబ, బొమ్మకు మురళి సతీమణి హిమమాల, మాస్టార్జీ సతీమణి గంగా ధరి ప్రమీల, మల్లెపల్లి లక్ష్మయ్య సతీమణి మల్లెపల్లి జయ తదితరులకు అవార్డులను అందచేయటం జరుగుతుందని వివరించారు. 17వ తేదీ జరగబోయే రమాబాయి అంబేద్కర్ పురస్కారాల ప్రదానోత్సవంలో అంబేద్కర్ అభిమానులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### అణగారిన వర్గాల హక్కుల కోసం నిలిచిన వ్యక్తి

## సంత్ సేవాలాల్ మహారాజ్ : ఎమ్మెల్యే దానం నాగేందర్



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** అణగారిన వర్గాల హక్కుల కోసం నిలబడి ఆత్మగౌరవంతో జీవించాలని సమాజానికి సంత్ సేవాలాల్ మహారాజ్ సందేశమిచ్చారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్‌నంబరు 14 నందినగర్‌లో సద్గురు సేవాలాల్ మమారాజ్ 287 జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ.. బంజారా సమాజానికి ఆరధ్యదైవంగా, మహనీయ ఆధ్యాత్మిక గురువుగా ఆయన గుర్తింపు పొందారన్నారు. సత్యం, ధర్మం, సమానత్వం తదితర విలువలను బోధించారన్నారు. ఆయన బోధనలు నేటికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ నైతిక జీవన విధానాన్ని అవలంబించాలని ఆయన ఉపదేశించారన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ మహాభోగ్ బండారో యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, బాబానాయక్, రాములుచౌహాన్, రాజేష్, ఈశ్వర్, శంకర్, రాందాస్‌చవాన్, మహిందర్, రతన్‌సింగ్ పాల్గొన్నారు.

## భక్తులకు పండ్లు పంపిణీ

**తార్నాక, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** మహాశివరాత్రి సందర్భంగా తార్నాక డివిజన్‌లో పలు ఆలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శివాలయాలు శివనామ స్మరణలతో మారుమోగాయి. శివుడికి రుద్రాభిషేకాలుతోపాటు ప్రత్యేక పూజలుచేశారు. బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ సుక్క గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కుందలాది మంది భక్తులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివయ్య ఆశీస్సులతో లాలాపేట్ డివిజన్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి పండుగ పర్వదినాన్ని పురస్కరించొని తాను వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మేకల సారంగపాణి, సుక్క గణేష్ ముదిరాజ్, బీజేపీ నాయకులు వెంకటేష్ గౌడ్, అధ్యక్షుడు ఉపేందర్ యాదవ్,నాయకులు కృష్ణమూర్తి, కరుణాకర్, రాము వర్మ, భాను, శ్రీకాంత్, దేవుడు కుమార్, బిక్షపతి యాదవ్, గౌతమ్, వనమాల శ్రీను పాల్గొన్నారు.

# పలు ఆలయాలను సందర్శించిన ఎమ్మెల్యే తలసాని



శివాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మహాశివరాత్రినిపురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమీర్‌పేట డివిజన్‌లోని హనుమాన్ టెంపుల్, గురుమూర్తినగర్‌లోని శ్రీవినాయక టెంపుల్‌లను ఆయన దర్శించుకున్నారు. ముం దుగా ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వినాయక టెంపుల్‌లో శివలింగానికి పాలతో అభిషేకం చేసి పూజలు జరిపారు. పూజల అనంతరం ఆలయపండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి,ఈఓలు జయంతి, నరేందర్‌రెడ్డి, డివిజన్‌అధ్యక్షుడు హన్మంత రావు, నాయకులు అశోక్‌యాదవ్, నామన సంతోష్ కుమార్, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కూతురు నర్సింహ, ప్రకాష్‌గౌడ్, కట్టా బలరాం, శివ, సత్య నారాయణ యాదవ్, ఉత్తమ్‌సింగ్ ఉన్నారు.

### క్రికెట్ పోటీలు ప్రారంభం..

మహా శివరాత్రి సందర్భంగా అమీర్‌పేటలోని మున్సిపల్ గ్రౌండ్‌లో తలసాని ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాట్‌పట్టి క్రికెట్ ఆడి క్రీడాకారులలో జోష్ నింపారు. వివిధ కాలనీలకు చెందిన 40 టీమ్‌లు పోటీలలో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు, బిఆర్ఎస్ నాయ కులు నామన సంతోష్‌కుమార్ తెలిపారు. ఆమీర్ పేట ప్రాంతంలోని యువతను ఒకచోట చేర్చి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడంపట్ల నిర్వాహకులను అభినందించారు. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీలలో గెలుపొందిన టీమ్ లకు మెమెంటోలను అందజేయనున్నట్లు ప్రకటించారు.

### సనత్‌నగర్‌లో...

మహా శివరాత్రి సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సనత్‌నగర్‌లోని సెవెన్ టెంపుల్స్ లోగల శివాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆయనను పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రాజేష్ ముదిరాజ్, ప్రదీప్ గౌడ్, ఖలీల్, అర్జున్‌గౌడ్, జమీర్, పురుషోత్తం ఉన్నారు.



శివలింగ దర్శనం చేసుకున్న లోకాయుక్త తెలంగాణ జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి

## జిహెచ్ఎంసి పార్కులో 12 అడుగుల శివలింగ దర్శనం

**ముషీరాబాద్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** దోమలగూడలోని జీహెచ్ఎంసీ పార్కులో బ్రహ్మకుమారి హిమాయత్‌నగర్ ఆధ్వర్యంలో 12 అడుగుల శివ లింగం ఏర్పాటుచేశారు. లోకాయుక్త తెలంగాణ జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దీప ప్రజ్వలన, శివలింగ అభిషేకం నిర్వహించారు.

## ఘనంగా నల్లగుట్ట హజ్రత్ పీర్ ఉర్సు ఉత్సవాలు



నల్లగుట్ట హజ్రత్ పీర్ ఉత్సవాల్లో పాల్గొని ప్రార్ధనలు చేస్తున్న తలసాని

**బేగంపేట ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్ట హజ్రత్ పీర్ ఉర్సు ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరై ప్రార్ధనలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు తలసానిని సన్మానించారు. ఎమ్మెల్యే వెంట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కిషోర్‌కుమార్, నిర్వాహకులు అష్రఫ్‌అలీ, సర్ఫరాజ్‌అలీ, ముజాహిద్, మజీద్, అప్సర్, సమీర్, సైఫ్, లతీఫ్, రైమాన్, చంద్ర ప్రకాష్ ఉన్నారు.

## పశుపతినాథ ఆలయంలో శివపార్వతుల కళ్యాణం



వడ్డెర బస్తీలో శివపార్వతి కళ్యాణంలో పూజలు చేస్తున్న కోట,విశాల్

**బేగంపేట ఫిబ్రవరి 15,ప్రభాతవార్త :** మహా శివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని బేగంపేట వడ్డెర బస్తీలో పశుపతినాథ దుర్గాదేవి సమేత ఆలయంలో కాంగ్రెస్ నేతలు ఆదివారం పూజలు నిర్వహించారు. వడ్డెర బస్తీలోని దేవాలయంలో నిర్వహించిన మహాశివరాత్రి సందర్భంగా సనత్ నగర్ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి కోట నీలిమ, నాయకుడు విశాల్‌సుధాంలు పూజలు నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని డి.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించగా నేతలు పాల్గొని పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, పీఎల్ కృష్ణ, శేఖర్, నసీర్(అడ్డు), షాజహాన్, బబ్లూ, అక్బర్, మోహిత్, కృష్ణ, రోజా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** పేద రోగులను ఆదుకొనేందుకు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకుంటామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన శ్రీనివాస్‌నగర్‌లోని ఎం.జీ.స్టాలిన్, మేడిబావికి చెందిన అలివేటి పుష్పలత, విజయపురి ప్రాంతానికి చెందిన డీఎస్ఆర్ కుమారి అస్వస్థతకుగురై, సితఫలమండీలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయాన్ని సహాయానికై ఆశ్రయించారు. వెంటనే స్పందించిన శాసనసభ్యులు పద్మారావుగౌడ్ వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిమ్స్ ఆసుపత్రిలో వైద్యసేవలను పొందేందుకు వీలుగా ఎల్ఓసి. పత్రాలను అందించారు. స్టాలిన్ కు రూ.2 లక్షలు, పుష్పలతకు రూ. 2.20 లక్షలు, కుమారికి రూ.50 వేల చొప్పున మొత్తం రూ. 4.70 లక్షల విలువజేసే ఎల్.ఓ.సీ. పాత్రలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను అందించడంలో తాము అగ్ర స్థానంలో నిలుస్తామని అన్నారు. కార్యక్రమంలో యువ నేత రామేశ్వర్ గౌడ్, సమన్వయకర్త రాజ సుందర్, స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

### కిటకిటలాడిన వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మహాశివరాత్రి సందర్భంగా వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఉన్న శివాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల సందర్భంగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఏకవార రుద్రాభిషేక మహోత్సవాలు, హాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శివకళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిదులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, గాంధీనగర్ మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ప్రధాన కార్యదర్శి బుగ్గాలక్ష్మీపతి, కందాళ వెంకటాద్రి, కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు, ఆలయం అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ పాల్గొన్నారు.

IN THE COURT OF THEHON'BLE PRINCIPAL JUNIOUR CIVIL JUDGE AT: MEDCHAL, MEDCHAL-MALKAJGIRI DISTRICT
O.S.NO. 33 OF 2026
BETWEEN:
1. **Godavarthi Bharathi** W/o. G Venkata satya sai
2. **Dr. Godavarthi Praneetha** W/o. Dr. Harsha G,
Both are R/o. H.No.HIG-430, 431, F.No. 401, S S Riviera, Phase VI, KBHB Colony, Kukatpally, PO: Kukatpally Dist. Medchal-malkajgiri, Hyderabad. **...Petitioners/Plaintiffs**
AND
**1. The Thasildar Medchal,** Quthbullapur Mandal, Medchal-Malkajgiri District
**2. All Concerned ...Defendants**
Take notice that, the above named Plaintiffs filed a Suit before the aforesaid Hon'ble Court to declare them as the only Legal Heirs of deceased late G.Venkata satya sai The said case is posted to **3.03.2026 at 10.30 AM,** for appearance, either in person or by an Advocate, failing which the case will be decided on merits in your absence.
(BY ORDER OF THE COURT)
**M/s. T. Rama Chandra Murthy, & Associates, 9246522775**
**V. Venkata Subramanyam, Advocates,**
**Office:** Flat No.403, ACE ELITE Apartment, Telephone Colony Main Road, Kothapet, Hyderabad-102.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS

CHANGE OF NAME

★ **I, AKULA CHANDRAMMA** W/o Akula Chinna Narasimhappa. Residing at Flat 102, Laxmi Enclave, Karolbagh, Mehdipatnam, Hyderabad, 500028, Telagana hereby declare that my full and correct Name is **AKULA CHANDRAMMA,** only But, in my passport (N7344430), my name mentioned a AKULA CHANDRALEKHA instead of **AKULA CHANDRAMMA.**

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

